
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
మంగళవారం 22 అక్టోబరు 2024



భళా.. చిత్రకళ!

చిత్రకళలో మేటి సున్నపు అశోక్

మనసులో మెదిలే భావాలకు రంగులు
అనేక చిత్రాలకు ప్రశంసలు, అవార్డులు

7

మనసులో మెదిలే భావాలకు రంగులు దిద్దుతూ. .ప్రకృతి అందాలను కాన్వాస్‌పై నిక్షిప్తం చేసి దానికి సృజనాత్మకతను జోడించి తన కుంచెతో అద్భుతమైన కళాఖండాలను తీర్చిదిద్దుతున్నాడు. పెయింటింగ్‌లో దౌల్తాబాద్ మండలానికి చెందిన యువకుడు డాక్టర్ సున్నపు అశోక్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. చదివించి అంతంత మాత్రమే అయినా తన కళా పరిమళంతో పలువురి మన్ననలు, ప్రశంసలు, అవార్డులు అందుకున్నాడు. -దౌల్తాబాద్, అక్టోబరు 21





సీతాఫలం.. ప్రియం

ఏటేటా తగ్గుతున్న పండ్ల దిగుబడి

తగ్గిన ఉత్పత్తి.. పెరిగిన డిమాండ్
బాక్స్ ధర రూ.500 నుంచి 700
ఫలాల సేకరణతో ఉపాధి
పొందుతున్న కూలీలు

7



క్రీడాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

7

శాప్ చైర్మన్ శివసేనారెడ్డి
32 జిల్లాల్లో సీఎం కప్ టార్చ్ ర్యాలీ
శామీర్‌పేటకు చేరుకున్న క్రీడాజ్యోతి



గ్రామాల అభివృద్ధికి రూ.117 కోట్లు

తాండూరు మండల పరిధిలోని
రహదారులకు మహర్దశ
12 గ్రామాలకు ఇంటర్నల్ రోడ్లు
త్వరలోనే టెండర్లు పూర్తి

7



ఔను.. అక్రమాలు నిజమే

తాండూరులో అనుమతి లేని
నిర్మాణాలపై వరుస ఫిర్యాదులు
స్వయంగా పరిశీలించిన
డీటీపీసీ రీజనల్ డైరెక్టర్
జిల్లా ట్రాస్క్‌ఫోర్స్‌కు నివేదిక

8

పోలీసు అమరుల త్యాగాలు
వెలకట్టలేనివి

» కలెక్టర్ ప్రతీక్ జైన్



అమరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ

వికారాబాద్, అక్టోబరు 21: పోలీసు అమరుల త్యాగుల వెలకట్టలేనివని, వారి సేవలను గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. సోమవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో స్మృతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ అమరుల స్థూపానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ ప్రజల ప్రశాంతత కోసం, తమ ప్రశాంతతను కోల్పోయి కూడా సేవలందిస్తున్నందుకు గర్వించాలన్నారు. దేశంలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నప్పుడే ప్రజలు సుఖ శాంతులతో సంతోషంగా ఉంటారన్నారు. పోలీసు అమరుల త్యాగాన్ని స్మరిస్తూ నివాళులు, వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ. జిల్లాలో పది రోజుల పాటుగా పోలీస్ స్టేషన్లలో వివిధ కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. దేశంలో ప్రజల సంరక్షణకు ఏడాది కాలంగా 214 మంది పోలీసులు తమ ప్రాణాలను కోల్పోవడం జరిగిందన్నారు. శాంతి భద్రతలను కాపాడుకుంటూ అభివృద్ధి పథంలో దూసుకువెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా అదనపు ఎస్పీలు రవీందర్ రెడ్డి, మురళీధర్, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులలు పాల్గొన్నారు.



కమిటీలు ఖరారు!

త్వరలో ప్రభుత్వం వద్దకు ఇందిరమ్మ కమిటీల జాబితా

చివరి దశకు చేరిన ఎంపిక ప్రక్రియ
ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే అమల్లోకి..
జిల్లాలో 684 ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు

నిరుపేదలకు ఇళ్ల పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రతిపాదించిన ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. ఇందిరమ్మ కమిటీల నియామక ప్రక్రియను ఈనెల 12వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉండగా, కొన్ని మునిసిపల్ వార్డులు, పంచాయతీల్లో ఈ కమిటీల ఏర్పాటులో జాప్యం చోటు చేసుకుంది. త్వరగా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు రావడంతో ఆ దిశగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

వికారాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నిరుపేదల సొంతింటి కల సాకారం చేసేందుకు, ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించింది. .ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా అర్హులను ఎంపిక చేసే బాధ్యత ఇందిరమ్మ కమిటీలదే. మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో నియామకమయ్యే ఇందిరమ్మ కమిటీలు సామాజిక బాధ్యతతో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. త్వరగా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు రావడంతో ఆ దిశగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా ఈ కమిటీలు పనిచేయనున్నాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమల్లో ఇందిరమ్మ కమిటీలు క్రియాశీలక

మిగతా 8వ పేజీలో...

ఐటీఐలకు సొబగులు

అందుబాటులోకి ఆరు ఆధునిక కోర్సులు



మేడ్చల్‌లో నిర్మిస్తున్న అధునాతన సాంకేతిక భవనం

ప్రయోగాత్మక కేంద్రాల్లో మేడ్చల్, అల్వాల్
రూ.4.6 కోట్లతో ప్రత్యేక భవన నిర్మాణం
ఒక్కో ఐటీఐలో 72 చొప్పున నూతన సీట్లు
30వ తేదీ వరకు అడ్మిషన్లకు అవకాశం

మేడ్చల్ ప్రతినిధి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో నైపుణ్యం ఉంటేనే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చాక ఆదరణ కోల్పోయిన ఐటీఐలకు పునర్వైభవం తెచ్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వాటిని అధునాతన సాంకేతిక కేంద్రాలు(అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్లు)గా తీర్చిదిద్దాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఐటీఐల్లో ఈ ఏడాది నుంచి కొత్తగా ప్రవేశపెట్టే ఆరు కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నైపుణ్య లేమితో అవకాశాలు కోల్పోతున్న విద్యార్థులకు ఈ కేంద్రాలు బాసటగా నిలవనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన 65 ఐటీఐల్లో జిల్లాలోని మేడ్చల్, అల్వాల్ పారిశ్రామిక శిక్షణ కేంద్రాల(ఐటీఐ)కు చోటు దక్కింది.

ఈ ఏడాది నుంచే ప్రవేశాలు

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు ఆరు ఆధునిక కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. మ్యానుప్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమెషిన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుప్యాక్చరింగ్, ఆర్టీసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వెరిఫైర్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్, మెకానికల్ ఎలక్ట్రికల్ వెహికిల్స్ కోర్సుల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు ఐటీఐలో ఉన్న ఫిట్టర్ ఎలక్ట్రిషియన్, వెల్డర్, మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్ తదితర కోర్సులతో పెద్దగా అవకాశాలు దక్కడం లేదు. దీంతో ఆధునిక సాంకేతిక కోర్సుల్లో విద్యార్థులకు మెరుగైన నైపుణ్యాలు అందించనున్నారు.

కోర్సు పూర్తవగానే ఉద్యోగం..

నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందనుంది. ప్రస్తుతం

మిగతా 8వ పేజీలో...

తొలిరోజు ప్రశాంతంగా గ్రూప్-1 మెయిన్స్

జిల్లాలో 17,779 మంది అభ్యర్థులకు 12 వేల మంది హాజరు

» 5,779 మంది గైర్హాజరు..ఆలస్యంగా వచ్చి పరీక్ష రాయని ముగ్గురు అభ్యర్థులు
» కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్లు, రాచకొండ సీపీ సుధీర్‌బాబు



అవుషాపూర్ విజ్ఞానభారతి కళాశాల వద్ద హాల్‌టికెట్ నెంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు


మేడ్చల్ ప్రతినిధి/ఘట్‌కేసర్ రూరల్/మేడ్చల్‌టౌన్/కీసర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సోమవారం జిల్లాలోని 27 పరీక్షా కేంద్రాల్లో 17,779 మంది అభ్యర్థులకు గాను 5779 మంది అభ్యర్థులు గైర్హాజరు కాగా 12వేల మంది పరీక్షకు హాజరయ్యారు. అభ్యర్థులను మధ్యాహ్నం 12.30 నుంచి 1.30గంటల వరకు కేంద్రాల్లోకి అనుమతించారు. అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, రాచకొండ సీపీ జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి హాల్‌లో 24 మంది అభ్యర్థులు మాత్రమే ఉండేలా ఏర్పాట్లు చేశారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బాసిరగడిలోని హితం కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 989 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలోని 8పరీక్షా కేంద్రాల్లో 4,416 మందికిగాను 3,434 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 982 మంది గైర్హాజరయ్యారు. చౌదరిగూడ ప్రిన్స్‌టన్, ఎదులాబాద్‌లోని మెగా ఇంజనీరింగ్ కళాశాల, అవుషాపూర్‌లోని వీటీఐటీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను రాచకొండ సీపీ సుధీర్‌బాబు, మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజారెడ్డిలు సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీటీఐటీ కళాశాల వద్ద రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో సీఐ పరుశురాం ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.మొత్తం 80 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. చీర్యాల్‌లోని గీతాంజలి కళాశాలలో 936 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 521మంది హాజరయ్యారని, 415మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. కాగా నిమిషం నిబంధనతో ముగ్గురు పరీక్ష రాయలేక పోయారు. అభ్యర్థులు గంగా, వీరారెడ్డి, వేణు కేంద్రానికి ఆలస్యంగా వచ్చారు. పరీక్షకు ఆలస్యం అవుతుండటంతో అభ్యర్థులను సీఐ వెంటకయ్య పోలీస్‌వాహనంలో తీసుకెళ్లారు.

దూరం నుంచి వచ్చే సరికి ఆలస్యం



కోదాడ నుంచి వచ్చే నగరానికి, అక్కడి నుంచి నుంచి పరీక్ష కేంద్రానికి వచ్చే సరికి ఆలస్యం జరిగింది. పరీక్ష కేంద్రానికి దూరం నుంచి వచ్చే సరికి ఆలస్యం కావడంతో అధికారులు అనుమతించలేదు. డిసెంబర్‌లో జరిగే గ్రూప్-2 పరీక్షకు సమయానికి కేంద్రానికి చేరుకుని పరీక్ష రాస్తా.
- వీరారెడ్డి, గ్రూప్-1 అభ్యర్థి

వుడా ఆవిర్భావం



చైర్మన్‌గా వ్యవహరించనున్న కలెక్టర్
వైస్ చైర్మన్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్
ఉత్తర్వులు జారీ చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ

వికారాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు, 20 మండలాల పరిధిలోని 493 గ్రామ పంచాయతీలతో కలిసి వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వుడా)ని ఏర్పాట్లు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో నాలుగు మునిసిపాలిటీలతో పాటు 585 గ్రామ పంచాయతీలు ఉండగా, వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మునిసిపాలిటీలతో పాటు 493 పంచాయతీలను అభివృద్ధి పరిచే విధంగా ఏర్పాటు చేశారు. కొడంగల్‌మండలంలో 17 పంచాయతీలు, వికారాబాద్‌లో 24, తాండూరులో 39, పరిగిలో 36, బొంరాస్‌పేట్‌లో 17, దుద్యాల్‌లో 12, కులకచర్లలో 16, బషీరాబాద్‌లో 31, మోమిన్‌పేట్‌లో 23, నవాబ్‌పేట్‌లో 22, ధారూరులోని 34 పంచాయతీలను వుడా పరిధిలోకి చేర్చారు. దౌల్తాబాద్‌లో 25, యాలాల్‌లో 33, బంట్వారంలో 13, కోట్‌పల్లిలో 18, పూడూరులో 34, మర్పల్లిలో 28, దోమలో 28, పెద్దేముల్‌లో 31, చౌడాపూర్ మండలంలోని 14పంచాయతీలను దీని పరిధిలోకి తీసుకువచ్చారు. ఈ పంచాయతీలను పట్టణాల్లో మాదిరిగా అభివృద్ధి చేయనున్నారు. కలెక్టర్ చైర్మన్‌గా ఏర్పాటైన వుడాకు అదనపు కలెక్టర్ (స్థానికసంస్థలు) వైస్‌చైర్మన్‌గా, ఆర్థికశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ/ప్రిన్సిపల్‌సెక్రటరీ/సెక్రటరీ లేదా వారి నామినీ, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్/డైరెక్టర్ లేదా వారి నామినీ, టౌన్‌అండ్ కంట్రీప్లానింగ్ డైరెక్టర్ లేదా వారినామినీ సభ్యులుగా వుడాను ఏర్పాటు చేస్తూ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దానకిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు.

హర్షణీయం

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



వికారాబాద్ : వికారాబాద్ జిల్లా పూర్తిగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీగా ఏర్పాటు కావడం హర్షనీయమని స్పీకర్ ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. వుడా ఏర్పాటు ద్వారా వికారాబాద్ జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందన్నారు. ముఖ్యంగా మునిసిపాలిటీల పరిధిలో రవాణా సదుపాయాలు మెరుగుపర్చడంతో పాటుగా ట్రాఫిక్ సులభతరం కానుందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి జిల్లా ప్రజల తరుపున ధన్యవాదాలు తెలిపారు.

నేడు వాహనాల వేలం

ఘట్‌కేసర్ రూరల్: వివిధ కేసుల్లో ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలకు నేడు వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ జూపల్లి రవి ఓ ప్రకటనలో తెలిపారు. ఘట్‌కేసర్ ఎక్సైజ్ పీఎస్‌లో మంగళవారం వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక స్కూటీతో పాటు మూడు యాక్టివాలకు వేలం ఉంటుందని, ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

సకాలంలో పాల బిల్లులు చెల్లించాలి



వినతి పత్రం అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి, రామకృష్ణ, తదితరులు

కడ్తాల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీ పాడి రైతులకు పెండింగ్ పాల బిల్లులను వెంటనే చెల్లించాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, కడ్తాల మాజీ ఉప సర్పంచ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కడారి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని టీఎస్‌డీడీసీఎఫ్ కార్యాలయంలో తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే కడ్తాల పాలశీతలీకరణ కేంద్రం ఎదుట రెండేళ్ల క్రితం నిర్మాణం పూర్తి అయిన దుకాణ సముదాయాన్ని వెంటనే ప్రారంభించి వ్యాపారస్థులకు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల పాడిరైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దాణా, పశుగ్రాసం కొనుగోలు, పాడి ఆవుల పోషణకు పాడిరైతులు అప్పులు చేయాల్సి వస్తుందని చైర్మన్‌కు వివరించినట్లు వారు పేర్కొన్నారు. ఈ అంశాలపై అమిత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో శంకర్ కొండ మాజీ ఉప సర్పంచ్ ప్రశాంత్ నాయక్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

పార్టీలో శ్రమించిన వారికి ప్రాధాన్యం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి



అంబయ్యగౌడ్‌ను సన్మానిస్తున్న అధికారులు

కొడంగల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో అంకితభావంతో పని చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. స్థానిక కేఎస్‌వీ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, కార్యదర్శి చంద్రశేఖర్ సమక్షంలో నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అంబయ్యగౌడ్, వైస్‌చైర్మన్‌గా ఆకారం శేఖు, డైరెక్టర్లుగా నర్సింహులు, సేవ్యానాయక్, కోటం రాములు, ఆసిఫ్‌ఖాన్, సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, చెన్నమ్మ, మల్లికార్జున్, అంజిలయ్య, భాస్కర్ నాయక్, మల్లేశ్‌కుమార్, మహేశ్‌కుమార్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ముద్దప్పదేశ్‌ముఖ్, జగదీశ్వర్‌రెడ్డి, శివకుమార్‌గుప్తా, నందారం ప్రశాంత్, టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యూసుఫ్ పాల్గొన్నారు.

అల్మాస్ స్కూల్, ఎంఈవోపై ఫిర్యాదు

తాండూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అల్మాస్ హైస్కూల్ అనుమతి లేకుండా నడిపిస్తున్నారని, ఈ విషయంలో తాండూరు ఎంఈవో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దీపక్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

నియామకం

అతిథి అధ్యాపకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సదానందంగౌడ్



ఆమనగల్లు , అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అతిథి అధ్యాపకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తలకొండపల్లి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన అయిల్ సదానందం గౌడ్ ఎన్నికయ్యారు. సోమవారం గెస్ట్ లెక్చరర్స్ సంఘం(1145) గౌరవాధ్యక్షుడు డాక్టర్ మదుసూధన్ రెడ్డి సమక్షంలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీలో సదానందంగౌడ్‌కు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అవకాశం లభించింది. ఆయన రాష్ట్ర సాధన, అధ్యాపకుల హక్కుల సాధన కోసం చేసిన పోరాటాలలో క్రియాశీలకంగా పాత్ర పోషించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అతిథి అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనను నియమించిన మధుసూధన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్ భాష, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, కమిటీ సభ్యులు భీమేశ్, బాల్‌రాజ్, సదానందంలకు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సురేందర్



కొత్తూర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని పెంజర్ల పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి హెచ్. సురేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. సురేందర్ మాట్లాడుతూ తన నియమాకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే శక్తివంచన లేకుండా పంచాయతీ కార్యదర్శులు అభ్యున్నతకి పాటుపడుతానని పేర్కొన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

'కడా' ప్రత్యేకాధికారి వెంకటేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకొని మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదుగుతూ, పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక సమాఖ్య భవనంలో నిర్వహించిన సమాశంలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాల అభివృద్ధితో పాటు పిల్లల విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తూ ఆర్థికంగా ఎదగాలన్నారు. ప్రభుత్వం మహిళలకు రుణాలు అందిస్తూ ప్రోత్సహించే దిశగా ముందుకు వెళ్తుందన్నారు. రుణాలను పొందడంతో పాటు, చెల్లించడంలో అలసత్వం వహించొద్దన్నారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు అంజిలమ్మ, తహసీల్దార్ విజయ్‌కుమార్, అడిషనల్ డీఆర్‌డీవో సరోజ, డీపీఎం వీరయ్య, ఏపీఎం వెంకన్న, సీసీలు, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం




క్రీడా జ్యోతిని పట్టుకున్న శాప్ చైర్మన్ శివసేనారెడ్డి, సీనియర్ క్రీడా కారుడు మర్రి లక్ష్మారెడ్డి, తదితరులు

శామీర్‌పేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): యువతకు అవసరమైన క్రీడా సౌకర్యాలను కల్పించి క్రీడారంగాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వం ధ్యేయమని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ(శాప్) చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శాప్ ఆధ్వర్యంలో ఈ నెల 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఎల్‌బీ స్టేడియంలో సీఎం కప్ టార్చ్ ర్యాలీని ప్రారంభించిన విషయం తెలిసిందే. అక్కడి నుంచి ఈ ర్యాలీని రాష్ట్రంలోని 32 జిల్లాల్లో పర్యటిస్తూ సోమవారం ఉదయం మేడ్చల్ జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శామీర్‌పేట మండలం తూంకుంట పరిధిలోని దొంగల మైసమ్మ చౌరస్తా వద్దకు చేరింది. అక్కడికి ముఖ్య అతిథిగా శాప్ చైర్మన్ శివసేనారెడ్డితో పాటు డీవైఎస్‌వో గోపాల్‌రావు హాజరయ్యారు. వారితోపాటు దాదాపు 450 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు క్రీడా జ్యోతిని పట్టుకుని రాష్ట్ర రాజీవ్ రహదారిలో దొంగల మైసమ్మ చౌరస్తా నుంచి స్పోర్ట్స్ స్కూల్ వరకు టార్చ్ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సీనియర్ ప్లేయర్ మర్రి లక్ష్మారెడ్డి, తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.

భళా.. చిత్రకళ!

- చిత్రకళలో మేటి.. సున్నపు అశోక్
- మనసులో మెదిలే భావాలకు రంగులు
- అనేక చిత్రాలకు ప్రశంసలు, అవార్డులు


దౌల్తాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండలం యాంకి గ్రామానికి చెందిన సున్నపు అశోక్ చిత్ర కళాకారుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. ఆయన డాక్టర్ సున్నపు ఆశప్ప, నర్సమ్మ దంపతుల కుమారుడు. తనదైన శైలీలో పలు కళాకృతులను ఆవిష్కరించి అబ్బురపరుస్తున్నాడు. చింత గింజలపై పలు దేశాల జాతీయ జెండాలు, బియ్యం గింజపై శివలింగం, విద్యుత్ బల్బులో జాతీయ చిహ్నాన్ని అమర్చి తన సృజనాత్మకతను చాటుకున్నాడు. సుద్ద ముక్కలతో కళాకృతుల తయారీ, పెన్సిల్‌పై పేర్లు చెక్కడం, కంది పప్పులతో ఆంగ్ల అక్షరాల తయారీ, కొబ్బరి చిప్పలతో పలు కళాఖండల తయారీ, ఐస్‌క్రీమ్ పుల్లలతో పలు చారిత్రాత్మక నిర్మాణాల తయారీ, రావి ఆకులపై రమణీయ చిత్రాలు, చిన్నపాటి బిస్కెట్లపై పలు మతాల చిహ్నాల తయారీ, కోడి గుడ్డు పెంకులపై జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల చిత్రాలను ఆవిష్కరించాడు. అప్పటి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మనవడితో సరదాగా బోసి నవ్వులతో గీసిన చిత్రం, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి, ఐఏఎస్ హరిచందన, శ్రీదేవి, మాజీ విద్యాశాఖ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చిత్రాలను పెన్సిల్‌తో గీసి వారికి బహుకరించి ఆకట్టుకున్నాడు.



పెన్సిల్‌తో గీసిన చిత్రం



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న అశోక్ (ఫైల్)



నీటిని తోడుతున్న రైతు చిత్రం

అశోక్ సాధించిన అవార్డులు

అశోక్ కళారంగంలో రాణిస్తున్న అశోక్ కృషిని మేజిక్ బుక్ ఆఫ్ రికార్డును హర్యానాకు చెందిన ఓ సంస్థ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్‌తో సత్కరించారు. ఏకే తెలుగు మీడియా ముంబై వారు ఉత్తమ చిత్రకారుడిగా అవార్డు అందించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, మహాత్మాగాంధీ అంతర్జాతీయ నోబెల్ శాంతి అవార్డు, స్వామివివేకానంద జాతీయ పురస్కారం, నవ భారత్ రాష్ట్రీయ జ్ఞానపీఠ్ అవార్డు, ఇంటర్ నేషనల్ యూత్ అవార్డు, పీవీ నరసింహరావు ప్రైడ్ ఇండియా అవార్డు, జాతీయ శివనంది, తదితర అవార్డులను అందుకొని ఆదర్శంగా నిలుస్తున్నాడు.

గ్రామాల అభివృద్ధికి రూ.117 కోట్లు మంజూరు

- తాండూరు మండల పరిధిలోని రోడ్లకు మహర్దశ
- డీసీసీబీ వైస్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్

తాండూరు రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : తాండూరు మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యాన్ని మెరుగు పరిచేందుకే స్థానిక శాసనసభ్యులు బి.మనోహర్‌రెడ్డి రూ.117 కోట్లు మంజూరు చేశారని, ఆయన కృషి అభినందనీయమని డీసీసీబీ వైస్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం తాండూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాండూరు మండలంలోని 12 గ్రామాలకు ఇంటర్నల్ రోడ్ల నిర్మాణం చేసేందుకు ఈ నిధులను కేటాయించారన్నారు. బషీరాబాద్-కరన్‌కోట్ 12కి.మీ రోడ్డుకు రూ.30 కోట్లు, మహబూబ్‌నగర్-చించొళి రోడ్డు మార్గంలోని తాండూరు పట్టణం సమీపంలో 4కి.మీ రోడ్డుకు రూ.35 కోట్లు, తాండూరు-వికారాబాద్ 39 కి.మీ. రోడ్డుకు రూ.101 కోట్లు, గౌతాపూర్-బెల్కటూర్ నుంచి వీరారెడ్డిపల్లి, చిట్టిఘనాపూర్, చంద్రవంచ, ఓగీపూర్ నుంచి కర్ణాటక సరిహద్దు సత్రశాల, కోటబాస్పల్లి నుంచి మల్కాపూర్ వరకు, జినుగుర్తి నుంచి సంకిరెడ్డిపల్లి మీదుగా గోపన్‌పల్లి, మిట్టబాస్పల్లి-బెల్కటూర్, అల్లాపూర్ నుంచి సిరిగిరిపేట్, కరన్‌కోట్ నుంచి జీవన్గి వరకు రోడ్ల నిర్మాణాల కోసం ఈ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ పనులను టెండర్ పూర్తి కాగానే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, డైరెక్టర్ జర్నప్ప, హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీశైలంగౌడ్, సాయిలు, యువజన కాంగ్రెస్ నాయకులు అనిల్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, గని కార్మిక సంఘం అధ్యక్షుడు పండరి, బోయిని నర్సింహులు, వెంకటేశ్, హాజపూర్ రాంరెడ్డి, నారాయణరెడ్డి, ఉప్పరి నర్సింహులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా రవీందర్‌గౌడ్



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో పాల్వన్ కుమార్

అయోడిన్ ఉప్పునే వినియోగించాలి

డీఎంహెచ్‌వో పాల్వన్ కుమార్

వికారాబాద్, అక్టోబరు 21: ప్రజలందరూ అయోడిన్ ఉప్పును మాత్రమే వాడాలని డీఎంహెచ్‌వో పాల్వన్ కుమార్ సూచించారు. అలాగే అధిక మోతాదులో ఉప్పును వినియోగించడం వలన అనారోగ్యం సంభవిస్తుందని ఆయనసూచించారు. సోమవారం ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు అన్నింటిని తగు పాళ్లలో తీసుకోవాలన్నారు. ప్రతీరోజు విధిగా వ్యాయామం చేయాలన్నారు. కొవ్వు తక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉపకేంద్రం, పాఠశాలలో, కళాశాలలో, అంగన్‌వాడీ కేంద్రాలలో, గ్రామ పంచాయతీలలో సమావేశాలు నిర్వహించి ప్రజలకు అయోడిన్ ఉప్పు ప్రాముఖ్యతపై అవగాహన కలిగించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజు, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి శ్రీనివాసులు సంబంధిత శాఖ అధికారులు జయరాం, రేణు కుమార్, ఏవో, సూపరింటెండెంట్లు, ఏఎన్‌ఎంలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న జనార్దన్‌రెడ్డి

చేవెళ్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పలుగుట్ట గ్రామంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందవాడ గేట్ నుంచి వయా పలుగుట్ట గ్రామం మీదుగా కందవాడ, నారాయణదాస్‌గూడ వరకు బీసీ రోడ్డు మంజూరైందన్నారు. ఇందుకు రూ.1.95కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఏఈ ప్రభాకర్, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, గ్రామాధ్యక్షుడు చిన్నరెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వీరారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జంగయ్య, రాంరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, అశోక్, రామయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులను అరికట్టాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

మహేశ్వరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని బీజేపీ రాష్ట్ర కార్య వర్గసభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయం పక్కనున్న దర్గా వద్ద సోమవారం ఓ వ్యక్తి మొక్కుబడి నిమిత్తంగా మేకను బలియ్యడాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాలపై వరుస దాడులు జరుగుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించలేదన్నారు. ఈ ధర్నాలో బీజేపీ నాయకులు మాధవాచారి, యాదీష్, మధుమోహన్, సుధాకర్, యాదగిరిరెడ్డి, శ్రావణ్, బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు రాఘవేందర్, రాజు, ఈశ్వర్, వినోద్, రామ్‌రెడ్డి, అనీల్, మహేష్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి బీజేపీ కృషి



సభ్యత్వ నమోదులో పీవీఆర్

కేశంపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తుందని, బీజేపీ అభివృద్ధితో పాటు ఎక్కువ మందికి పార్టీ సభ్యత్వాలు ఇప్పించిన వారికే పదవులలో సముచిత స్థానం ఉంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. సోమవారం కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, దత్తాయపల్లి, వేములనర్వ, చింతకుంటపల్లి గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. నాయకులు తమ బూత్‌లో కనీసం 100 మందికి సభ్యత్వం ఇప్పించాలని సూచించారు. పార్టీ బలోపేతమైతే భవిష్యత్తులో ఎన్నో పదవులు పొందవచ్చని తెలిపారు. పార్టీ కోసం పనిచేసే వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో సముచిత స్థానం కల్పిస్తామని వివరించారు. పార్టీ కోసం కష్టపడితే జడ్పీటీసీ, ఎంపీటీసీలయ్యే అవకాశం లభిస్తుందని తెలిపారు. బీజేపీ మండలాధ్యక్షుడు రొల్లు రఘురాములుగౌడ్, నాయకులు మధుసూదన్‌గౌడ్, పర్వతాలు, పద్మకృష్ణయ్య, జ్ఞానేష్, శేఖర్, వినయ్, విగ్నేష్, పారేశ్, నవీన్, గురుప్రసాద్, భిక్షపతి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యం

తాండూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యకమని తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు అన్నారు. కళాశాలలో సోమవారం ఉమెన్ ఇన్ డాటా ప్రోగ్రాంను లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ హైదరాబాద్ సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. 'కృత్రిమ మేధా, సాంకేతిక పరిజ్ఞానంలో మహిళా సాధికారత' అనే అంశంపై 20గంటల పాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంజీవులు, కళావతి, విశాల, సత్యలక్ష్మి, బాబు, మమత, కిషన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీతాఫలం.. ప్రియం



ఏటేటా తగ్గుతున్న పండ్ల దిగుబడి ● తగ్గిన ఉత్పత్తి.. భారీగా పెరిగిన డిమాండ్

- బాక్స్ రూ.500-రూ.700 పలుకుతున్న ధర
- ఆమనగల్లు, పరిగి ప్రాంతాల్లో జోరుగా విక్రయాలు
- ఫలాల సేకరణతో ఉపాధి పొందుతున్న కూలీలు



పరిగి/ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాలకు ఎగుమతి, డిమాండ్ పెరిగిన కారణంగా మార్కెట్‌లో సీతాఫలాలు ధరలు ఒక్కసారిగా పెద్ద మొత్తంలో పెరిగాయి. రియల్ ఎస్టేట్ ప్రభావంతో చెట్ల సంఖ్య భారీగా తగ్గింది. దీంతో కేవలం అటవీ ప్రాంతాలలోనే దిగుబడి వస్తోంది. అలాగే ఉమ్మడి జిల్లాలోని పలు ఆమనగల్లు, పరిగి ప్రాంతాల్లో ఉపాధి కోసం కూలీలు ఫలాల వ్యాపారాన్ని ఎంచుకోవడం ఆనవాయితీ. పెద్దల అమావాస్య మొదలుకొని నవంబర్ నెలాఖరు వరకు సీతఫలాల వ్యాపారం జోరుగా సాగుతుంది. అడవుల నుంచి సేకరించిన సీతాఫలాలను నగరాలకు రవాణా చేస్తుంటారు. రెండు నెలల పాటు అన్ని మార్కెట్‌లను ముంచెత్తే ఈ ఫలాలలో పోషక విలువలు కూడా అధికమే.

✦ సీతాఫలాల దిగుబడిలో రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్లు, కడ్తాల ప్రాంతాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉంది. ఆమనగల్లు , కడ్తాల మండలాల పరిధిలోని చరికొండ, ముద్విన్, మైసిగండి, ఎక్వాయిపల్లి, గోవిందాయిపల్లి, వాస్‌దేవ్‌పూర్, కోనాపూర్, చెన్నారం, అన్మాస్‌పల్లి, చల్లంపల్లి, రాంనుంతల, అయ్యసాగర్, విఠాయిపల్లి, మంగళపల్లి, మాలెపల్లి తదితర గ్రామాలు సీతాఫలాలకు ప్రసిద్ధి. శ్రీశైలం - హైదరాబాద్ జాతీయ రహదారిపై సీతాఫలాల విక్రయాలు జోరందుకున్నాయి. వంద కాయలు ఉన్న ఒక గంప సైజును బట్టి రూ.500 నుంచి రూ.600ల వరకు విక్రయిస్తున్నారు. పండు నాణ్యత, సైజును బట్టి రూ.20 నుంచి రూ.35 వరకు మార్కెట్లో విక్రయిస్తున్నారు.

అమృతఫలమైన సీతాఫలాల ధరలు భగ్గుమంటున్నాయి. ఏటేటా తగ్గుతున్న చెట్ల సంఖ్యతో ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ ఏడాది చాలినంత వర్షం కురువడంతో గతేడాది కంటే సీతాఫలాలు విరివిగా దొరుకుతున్నాయి. అయినా డిమాండ్ భారీగా పెరగడంతో ధరలు ఆకాశన్నంటుతున్నాయి. యాపిల్ ధరలను మించి పోటీపడుతున్నాయి. దీంతో అత్యంత పోషక విలువలు కలిగిన సీతాఫలాల రుచికి పేదలు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. కాయల నాణ్యతను బట్టి డజన్ రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో దొరుకుతున్న సీతాఫలాల లభ్యత, ధరలు, క్రయవిక్రయాలపై ప్రత్యేకం.

పరిగి నుంచి ఇతర ప్రాంతాలకు

వికారాబాద్ జిల్లాలోని పరిగి, కులకచర్ల, దోమ, బొంరాసిపేట్, కొడంగల్, దౌల్తాబాద్, యాలాల్ మండలాల్లో సీతాఫలాల వ్యాపారం ముమ్మరంగా సాగుతోంది. పరిగి పరిధిలో కులకచర్ల, కొత్తపల్లి, అనంతసాగర్, రాంరెడ్డిపల్లి, పీరంపల్లి, కామునిపల్లి, ముజాహిద్‌పూర్, ఊటుపల్లి, కిష్టాపూర్, పూడూరు ప్రాంతాల్లోని అడవుల్లో లభ్యమయ్యే సీతాఫలాలను పరిగి తరలించి ఇక్కడి నుంచి హైదాబాద్, ముంబాయి తదితర నగరాలకు తరలిస్తున్నారు. అలాగే ముంబాయి, గోవా తదితర ప్రాంతాలకు కూడా ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తున్నారు.



పరిగి శివారులో రోడ్డు పక్కన విక్రయాలు

భారీగా పెరిగిన డిమాండ్



దశాబ్ద కాలంగా కడ్తాలలో సీతాఫలాల విక్రయాలు సాగిస్తున్నాం. యేటా మూడు నెలల పాటు ఉపాధి దొరుకుతుంది. సీతాఫలాలకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. దీంతో గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాలు, అటవీ ప్రాంతాల నుంచి మేము సేకరించిన కాయలను పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో స్థానికంగా కాయలు దొరక్క ధర భారీగా పెరిగింది. - ఆనంద్, సీతాఫలాల వ్యాపారి, కడ్తాల్

కాయలు బాగా పిరమైనవి



సీతాఫలాల చెట్లు బాగా తగ్గిపోయాయి. దీంతో దిగుబడి తగ్గి కాయలు పిరమైనవి. ధర పెరిగిన కారణంగా ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వారే కొనుగోలుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. మేము కూడ రైతు కూలీలు, గిరిజనుల నుంచి పెట్టె కాయలు రూ.800 నుంచి రూ.1,200ల వరకు తీసుకొని కూలీ గిట్టుబాటు చేసుకొని డజన్లు, కిలోల లెక్కన విక్రయిస్తున్నాం.

- గీత, సీతాఫలాల విక్రయదారు, కడ్తాల్

బాక్స్ రూ.600లకు విక్రయిస్తున్నాం



సీతాఫలాలతో రెండు నెలలపాటు ఉపాధి దొరుకుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో సీతాఫలాలకు మంచి ధర కూడా లభిస్తుంది. బాక్స్ ధర నాణ్యతను బట్టి రూ.450ల నుంచి రూ.700ల వరకు విక్రయిస్తున్నాం. ఇప్పుడు పనులు లేని సమయంలో సీతాఫలాల సేకరణతో మంచి ఉపాధి దొరకుతుంది. - వెంకట్, కూలీ, బొంపల్లితండా

కాశనకుంట చెరువు నీటి శాంపిల్స్ సేకరణ

పీసీబీ, ఇరిగేషన్ అధికారుల పరిశీలన

కొత్తూర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో గల కాశనకుంట చెరువును పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇరిగేషన్ శాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. కాశనకుంట చెరువు సమీపంలో కొత్తూర్ పారిశ్రామికవాడ ఉండడంతో వివిధ పరిశ్రమలు వదులుతున్న వ్యర్థాలు, నీరు, రసాయనాలు కాశనకుంట చెరువులోకి వదులుతుండడంతో చెరువు కలుషితమవుతోంది. ఇటీవల చేపలు మృతువువాత పడడంతో మత్స్యకారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో పీసీబీ ఏఈ విద్యలత, షాద్‌నగర్ ఇరిగేషన్ ఈఈ ప్రతిమ, ఏఈఈ మనీషలు చెరువు పరిసరాలతో పాటు, నీటిని పరిశీలించారు. నీటి శ్యాంపిల్స్ సేకరించారు. ఏఈ విద్యలత మాట్లాడుతూ చెరువు నీరు కలుషితమవుతున్నాయని ఫిర్యాదు అందడంతో పరిశీలించడానికి వచ్చినట్లు చెప్పారు. శ్యాంపిల్స్ నీటిని ల్యాబ్‌కు పంపుతున్నామని, పూర్తి స్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కోర్సులలో ఏడో విడతలో మిగులు సీట్ల భర్తీకి ప్రవేశాలు జరుగుతున్నాయని ప్రభుత్వ ఐటీఐ, వికారాబాద్ ప్రిన్సిపాల్ నరేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోనే వారు 30న ఉదయం 11 గంటలకు చేరుకోవాలన్నారు. పది, ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈ అవకాశం ఉందన్నారు. సంబంధిత ఆ వివరాలన్నింటినీ వెబ్‌సైట్‌లో పొందుపర్చడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9177472488, 8555865421 నంబర్లను సంప్రదించాలలని సూచించారు.

ఔను.. అక్రమ నిర్మాణాలు నిజమే

- అనుమతి లేని నిర్మాణాలపై వరుస ఫిర్యాదులు
- స్వయంగా పరిశీలించిన డీటీపీసీ రీజినల్ డైరెక్టర్
- జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు నివేదిక

తాండూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగం అక్రమాలపై డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ (డీటీపీసీ) దృష్టి సారించింది. అక్రమ నిర్మాణాలపై చాలా వరకు ఫిర్యాదులు అందడంతో శనివారం తాండూరు మున్సిపాలిటీ పరిధిలో డీటీపీసీ ప్రాంతీయ డైరెక్టర్ నర్సింహారెడ్డి తన బృందంతో తాండూరుకు వచ్చి స్వయంగా పరిశీలించారు. ఒకటి, రెండు అంతస్థులకు అనుమతి తీసుకోని నాలుగు, ఐదు అంతస్థులు నిర్మిస్తున్నారని గుర్తించారు. ప్రాథమిక స్థాయిలో నిర్మాణాలు నియంత్రించడంలో అధికారులు నోటీసులు ఇచ్చి వదిలేశారని, అక్రమంగా వాణిజ్య భవనాలు నిర్మించినా నోటీసుల వరకే పరిమితం చేశారని గుర్తించారు. అనుమతి లేకుండా నిర్మించిన వాణిజ్య భవనాలను కచ్చితంగా కూల్చివేస్తామని జిల్లాస్థాయిలో టాస్క్‌ఫోర్స్‌కు నివేదిస్తామని ఆర్‌జేడీ చెప్పారు.



తాండూరులో అక్రమంగా నిర్మించిన భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్‌జేడీ బృందం(ఫైల్)

నోటీసులు ఇచ్చారు.. వదిలేశారు

తాండూరు పట్టణంలో సర్వేనంబర్ 111లో ఇంటి నిర్మాణాలకు, గతంలో కాంగ్రెస్ పార్టీ భవనం నిర్మాణానికీ అనుమతి ఇవ్వలేదని అధికారులు తెలిపారు. అదేవిధంగా కొడంగల్ రోడ్డు మార్గంలో నాలాపై నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌కు అనుమతి ఇవ్వకుండా నోటీస్ మాత్రం ఇచ్చామని, అయినా రెండంతస్థుల భవనాన్ని నిర్మించారని తెలిపారు. శివాజీచౌక్‌లో గల దుకాణాల సముదాయ నిర్మాణానికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఆవార్డు కౌన్సిలర్ సాహు శ్రీలత దరఖాస్తు చేసుకోగా వివరించారు. అదేవిధంగా తాండూరు పట్టణం శాంతినగర్‌లో నిర్మిస్తున్న కాంప్లెక్స్‌కు అనుమతులు ఇచ్చారా? అని మాజీ కౌన్సిలర్ అనురాధ దరఖాస్తు చేసుకోగా ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని వివరణ ఇచ్చారు. అయినా ఆ నిర్మాణాన్ని ఆపడం లేదు. సర్వే నెంబర్ 52లో కూడా మున్సిపాలిటీ అనుమతులు లేకుండా చాలా ఇళ్లు నిర్మించారని అధికారులు తేల్చారు. పట్టణంలోని హుస్సేన్‌నగర్‌లో నిర్మాణంలో ఉండి కూలిన భవనానికి ఎలాంటి నిర్మాణం చేపట్టకుండా నోటీసు ఇచ్చామని చెప్పారు. అయితే 30 ఏళ్ల కిందట జరిగిన నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తే మాత్రం టౌన్‌ప్లానింగ్ అధికారులు సత్వరమే స్పందించి సెటిల్‌మెంట్ చేసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. కొత్తగా నిర్మిస్తున్న వాటికి ఫిర్యాదులు వస్తే కేవలం నోటీసులు ఇచ్చి అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఆర్‌జేడీ బృందం పరిశీలించిన భవనాలివే

తాండూరు పట్టణం కొడంగల్ రోడ్డు మార్గంలోని నాలాను ఆక్రమించుకొని వాణిజ్య భవనాన్ని నిర్మిస్తున్నారని ఫిర్యాదు మేరకు అధికారులు పరిశీలించారు. ఆదర్శనగర్, శాంతినగర్‌లోని శెట్టి కాంప్లెక్స్ భవనాన్ని, చించోళి రోడ్డు శివాజీచౌక్‌లోని వాణిజ్య భవనాన్ని, ఇందిరాచౌక్‌లోని సినిమా థియేటర్ చుట్టూ అనుమతి లేకుండా నిర్మిస్తున్న వాణిజ్య దుకాణాలను పరిశీలించారు. తనిఖీ చేయబడిన భవనాలకు సంబంధించిన ఫైల్‌ను డీటీపీసీ కార్యాలయానికి పంపించాలని ప్రాంతీయ డైరెక్టర్ నర్సింహారెడ్డి ఆదేశించారు. ఈభవనాల విషయంలో ప్రాథమిక స్థాయిలో నియంత్రించడంలో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది విఫలమయ్యారని ఉన్నతాధికారులు గుర్తించారు. స్వయంగా తాండూరు పట్టణంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆధారాలతో సహా మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

న్యూస్ బాక్స్

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్‌లో మిషన్‌భగీరథలో నీటి సరఫరా సహాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీటి సమస్యల పరిష్కారానికి నిధుల కొరత లేదని, ఉన్న వనరులను వృథా కాకుండా సద్వినియోగం చేసుకునేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మినరల్ వాటర్ కూడా గడువు తర్వాత విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎంఏ కరీం, డీఈఈ సుబ్రమాణ్యం, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

మేడ్చల్ ప్రతినిధి/వికారాబాద్, అక్టోబరు 21: ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి 114 దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిశీలించి పరిష్కరించాలని లేని పక్షంలో వారికి వాటి పెండింగ్‌కు గల కారణాలను వారికితెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఆర్‌డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా మేడ్చల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 55 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, లాఆఫీసర్ చంద్రావతి ఫిర్యాదులను స్వీకరించారు. ఈఅర్జీలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

బషీరాబాద్ రోడ్లకు మహర్దశ

బషీరాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రోడ్లకు మహర్దశ పట్టిందని బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.మాధవరెడ్డి అన్నారు. బషీరాబాద్‌లోని ఏఎంసీ కార్యాలయంలో విలేఖర్ల సమావేశంలో మట్లాడారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల రోడ్ల అభివృద్ధికి రూ.36.20 కోట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. బషీరాబాద్-జీవన్గి మీదుగా కరణ్‌కోట్ రోడ్డుకు రూ.30 కోట్లు, గొట్టిగకలాన్-కొడంగల్ తాలుకా పటిమీదిపల్లి రోడ్డుకు రూ.87.50లక్షలు, నవాంద్గీ- కర్ణాటక రాష్ట్రం అల్లాకోడ్ తెలంగాణ లిమిట్స్ వరకు లింకు రోడ్డు అభివృద్ధికి రూ.101.50లక్షలు, నవాంద్గి శివాలయం- పంప్‌హౌజ్ వరకు గల రోడ్డుకు రూ.56లక్షలు, జీవన్గి-మంతట్టి మధ్య రోడ్డు అభివృద్ధికి రూ.375లక్షలు మంజూరైనట్లు వివరించారు. ఎమ్మెల్యే త్వరలో ఈ పనులను ప్రారంభిస్తారని తెలిపారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సన్మానం

దౌల్తాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. సోమవారం కొడంగల్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌తో పాటు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులకు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రమోద్‌రావు, విజయ్‌కుమార్, మల్లేశం, నాగేందర్, రఘుపతి పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం

వికారాబాద్, అక్టోబరు 21: మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ అన్నారు. పట్టణంలోని 20వ వార్డు రాజీవ్‌గృహకల్పలో సోమవారం సీసీరోడ్డు, యూజీడీ పైప్‌లైన్, ట్రాన్స్‌ఫార్మర్ పనులకు శంకుస్థాపన 10వ వార్డు అనంతగిరిపల్లిలో, 28వ వార్డు పాతగంజి, 17వ వార్డు రాజీవ్‌నగర్ కాలనీల్లో సీసీ రోడ్డు, యుజిడీపైప్‌లైన్ ట్రాన్స్‌ఫార్మర్ లాంటి వివిధ పనులను మునిసిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ పనులకు ఎమ్మెల్యే నిధులు, 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్ కుమార్, మురళి, దేవిరెడ్యానాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్ దొంగను స్తంభానికి కట్టేసి దేహశుద్ధి

- పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు



ముకుందంను స్తంభానికి కట్టేసిన గ్రామస్తులు

పరిగి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బైక్ చోరీ చేసిన వ్యక్తిని గ్రామస్తులు పట్టుకుని స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. ఈ ఘటన సోమవారం రాత్రి గడిసింగాపూర్‌లో జరిగింది. తాండూరు ప్రాంతానికి చెందిన వ్యక్తి ఈనెల 18న పరిగిలోని విజేత ఆస్పత్రి దగ్గర పెట్టిన బైక్ చోరీకి గురైంది. దోమ మండలం బుద్లాపూర్ గ్రామానికి చెందిన ముకుందం పరిగిలో పెయింటర్‌గా పనిచేస్తుంటాడు. దొంగతానికి గురైన బైక్‌పై ముకుందం సోమవారం గడిసింగాపూర్ మీదుగా వెళుతుండగా బైక్ యజమానికి చెందిన బంధువులు గుర్తించి ముకుందంను పట్టుకుని స్థానిక విద్యుత్‌స్తంభానికి కట్టేసి చితకబాదారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పరిగి పోలీసులు దొంగను స్టేషన్‌కు తరలించారు.

పేలిన ఫ్రిజ్.. తప్పిన ముప్పు

కులకచర్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ మండలం చాకల్‌పల్లి గ్రామంలో గ్యాస్ సమస్యతో ఫ్రిజ్ పేలింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన చెంచు చెన్నయ్య సోమవారం పొలానికి వెళ్లాడు. సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్రిజ్ గ్యాస్ సమస్యతో పేలింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకున్నాడు.

కుక్కల దాడిలో విద్యార్థికి గాయాలు

మర్పల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్తున్న ఓ విద్యార్థిపై వీధికుక్కలు దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పట్లూర్ గ్రామానికి చెందిన అశ్విత్ అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. రోజూ మాదిరిగా శుక్రవారం సైకిల్‌పై పాఠశాలకు వెళ్తుండగా వీధి కుక్కల గుంపు ఒక్కసారిగా అశ్విత్‌పై దాడి చేశాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమికొట్టి గాయాలపాలైన అశ్విత్‌ను అదే గ్రామంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇప్పటికైనా అధికారులు వీధి కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఐటీఐలకు సొబగులు

(5వ పేజీ తరువాయి)

టాటా కంపెనీ రెండేళ్ల వరకు కోర్సు నిర్వహణ బాధ్యత తీసుకుంది. తర్వాత ఆ గడువు పొడగించనున్నారు. కోర్సు పూర్తి చేసిన వెంటనే ఇంటర్న్‌షిప్ కల్పిస్తారు. అనంతరం వారికి కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు లభించనున్నాయి. ప్రస్తుతం కృత్రిమ మేధ(ఏఐ)కు ఆదరణ కనిపిస్తున్న నేపథ్యంలో ఐటీఐల్లో కొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఇప్పటికే వచ్చిన యంత్రాలు

అధునాతన సాంకేతిక కేంద్రాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. మేడ్చల్, అల్వాల్ ఐటీఐ ఆవరణల్లో రూ.4.6 కోట్లతో నూతన భవన సముదాయాలను నిర్మిస్తున్నారు. ఇప్పటికే నూతన కోర్సులకు అవసరమయ్యే కొన్ని యంత్రాలు వచ్చాయి. నూతన భవనాల నిర్మాణం పూర్తయ్యే వరకు ఆ యంత్రాలను పాత భవనాల్లో ఉంచి శిక్షణ ఇవ్వనున్నారు. మిగిలినవి కూడా త్వరలో రానున్నాయి. ఆయా కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు యంత్రాలను ఇప్పటికే సిద్ధం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఐటీఐల్లో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు కూడా కొత్త కోర్సుల్లో ప్రవేశాలు తీసుకోవచ్చు.

172 సీట్లకు అనుమతి..

కొత్తగా ప్రవేశపెట్టిన ఆరు కోర్సులతో విద్యార్థుల్లో మెరుగైన నైపుణ్యాభివృద్ధి సాధ్యమవుతుంది. శిక్షణ పూర్తి చేస్తే కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. నూతనంగా తీసుకొచ్చిన ఆరు కోర్సుల్లో ఒక్కో ఐటీఐలో 172 సీట్లకు అనుమతి ఉంది.

మెరుగైన ఉపాధి అవకాశాలు

ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పెంచారు. ఆధునిక సాంకేతిక కోర్సులతో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉంటాయి. ఈ కోర్సులు పూర్తయిన వెంటనే కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు కూడా లభిస్తాయి. **- హనుమనాయక్, మేడ్చల్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్**

పోలీస్ అమరుల త్యాగాలు మరువలేనివి



పరిగి: సుల్తాన్‌పూర్‌లో విజయభాస్కర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న డీఎస్పీ

పరిగి అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరుల త్యాగాలు మరువలేనివని, వారి సేవలను గుర్తించుకోవాల్సిన అవసరం ఉందని పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని సుల్తాన్‌పూర్ స్టేజి దగ్గర ఉన్న బలిమెరలో అమరుడైన విజయ్‌భాస్కర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: పోలీసు అమర వీరుల సంసర్మణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ పరశురాం అమరులైన పోలీసులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఐ శ్రీనివాస్, అడ్మిన్ ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐలు నర్సింహ, శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ రూరల్: పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీఐ, పోలీస్ సిబ్బంది

పార్టీ సభ్యత్వంలో జిల్లాను ముందుంచుదాం



యాలాల: సభ్యత్వ నమోదు చేయిస్తున్న బీజేపీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

తాండూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదులో వికారాబాద్ జిల్లాను ముందుంచుదామని ఆ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తాండూరులో బూత్ నెంబర్ 139, 140లలో సోమవారం పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి వివేకానందరెడ్డి, భద్రేశ్వర్, శ్రీహరి, కిరణ్ పాల్గొన్నారు.

యాలాల: మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి మండలంలో బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో వివేకానందరెడ్డి, బాలేశ్వర్‌గుప్తా, రాస్నం రవి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సోమవారం నియోజక వర్గం కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదులు చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు మల్కాజిగిరి ఇన్‌చార్జిగా సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్: బీజేపీ సభ్యత్వ నమోదు మల్కాజ్‌గిరి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి నియమితులైయ్యారు. ఎంపీ ఈటల రాజేందర్ సోమవారం ఆయనకు నియమాకపత్రం అందజేసి, శాలువాతో సత్కరించారు.



ఎంపీ ఈటల రాజేందర్‌తో సుదర్శన్‌రెడ్డి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

తాండూరు రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. తాండూరు మండల మహిళా సమాఖ్య 19వ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశాన్ని జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సమాఖ్య అధ్యక్షురాలు రేణుక అధ్యక్షతన జరిగిన ఈసమావేశానికి ఎంపీడీవో విశ్వప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో సమాఖ్య నిర్వహించిన, అధ్యక్ష, కార్యదర్శులు గ్రామాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై వివరించారు. అనంతరం 2023-24 సంవత్సరానికి గాను వార్షిక నివేదికను ఎంపీడీవోకు అందజేశారు. సమాఖ్య టర్నోవర్ రూ.99లక్షల 19వేల 983లు గా ఉందని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.9లక్షల 90వేల బడ్జెట్ ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు రేణుక, కార్యదర్శి శ్యామల, కోశాధికారి వెంకటలక్ష్మి, ఆనంద్, శేఖర్, ఎం.ప్రభు, సంధ్య, శంకర్, అరవింద్, మాణిక్‌రెడ్డి, అనసూయ వెంకటయ్య పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం

కొడంగల్ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ జంగమ సమాజం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఉపాధ్యాయులుగా నియామకమైన వారితో పాటుగా ఉద్యోగోన్నతి పొందిన వారిని ఆదివారం రాత్రి ఘనంగా సన్మానించారు. కోస్గి ఇంద్రనీలేశ్వర ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జంగమ సమాజం కొడంగల్ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు మల్లిఖార్జునస్వామి, హంపయ్యస్వామి, వినయకుమార్ స్వామి, శ్రీశైలం, జగదీష్‌స్వామి, అమరలింగస్వామి పాల్గొన్నారు.

కమిటీలు ఖరారు!

(5వ పేజీ తరువాయి)

భూమిక పోషించాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ ఇందిరమ్మ కమిటీలు తెరపైకి వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షల ఆర్థిక సాయం మూడు విడతల్లో అందజేస్తామని గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. గత డిసెంబరు నెలలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన కార్యక్రమం పేరిట ప్రజల నుంచి వివిధ సంక్షేమ కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందడానికి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించగా, జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 2,64,242 దరఖాస్తులు వచ్చాయి.

684 కమిటీల నియామకం?

వికారాబాద్ జిల్లాలో 684 ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కానున్నట్లు తెలుస్తోంది. నాలుగు మునిసిపాలిటీల్లో 99వార్డులు, 585 గ్రామ పంచాయతీలున్నాయి. గ్రామ పంచాయతీల్లో 566 ఇంతకు ముందున్న గ్రామ పంచాయతీలు కాగా, కొత్తగా మరో 19 గ్రామ పంచాయతీలు ఏర్పాటైన విషయం తెలిసిందే. మునిసిపాలిటీల్లో ఒక్కో వార్డుకు, గ్రామీణ ప్రాంతాల్లో ఒక గ్రామ పంచాయతీ పరిధిలో ఒక ఇందిరమ్మ కమిటీ ఏర్పాటు కానున్నాయి. గ్రామ పంచాయతీల్లో ఎంపీడీవోల ఆధ్వర్యంలో, ఏర్పాటైన ఇందిరమ్మ కమిటీల్లో ఏడుగురికి సభ్యులుగా అవకాశం కల్పిస్తున్నారు.

గ్రామాలు, మున్సిపాలిటీల్లో..

గ్రామ పంచాయతీల పరిధిలో ఇందిరమ్మ కమిటీలకు సర్పంచ్ లేదా ప్రత్యేకాధికారి చైర్మన్‌గా కొనసాగనున్నారు. పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా కొనసాగుతారు. గ్రామంలో స్వయం సహాయక సంఘాలకు చెందిన ఇద్దరు మహిళలు సభ్యులుగా ఉండనున్నారు. అంతే కాకుండా ఈ కమిటీలో ముగ్గురు స్థానికులను సభ్యులుగా తీసుకోనుండగా, వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల నుంచి ఒక్కొక్కరికీ అవకాశం కల్పించనున్నారు. అదే మునిసిపాలిటీల్లోనైతే వార్డు స్థాయిలో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటుకు చర్యలు చేపట్టగా ఈ ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. వార్డుల్లో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు ప్రక్రియను మునిసిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తున్నారు. మునిసిపాలిటీల్లో వార్డు కౌన్సిలర్లు ఇందిరమ్మ కమిటీకి చైర్మన్/చైర్‌పర్సన్‌గా వ్యవహరించనుండగా, వార్డు అధికారి కమిటీకి కన్వీనర్‌గా కొనసాగనున్నారు. స్వయం సహాయక సంఘాలకు చెందిన ఇద్దరు మహిళలు, స్థానికుల కోటాలో మరో ముగ్గురికి సభ్యులుగా అవకాశం కల్పించనున్నారు. స్థానికుల కోటాలో నియామకమయ్యే వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లో నుంచి ఒక్కొక్కరికీ కమిటీలో చోటు కల్పించనున్నారు. మునిసిపాలిటీల పరిధిలో కమిషనర్లు, మండలాల పరిధిలో ఎంపీడీవోలు ఇందిరమ్మ కమిటీల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి తుది నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నారు.

చివరి దశకు కమిటీల ఏర్పాటు ప్రక్రియ

ఇందిరమ్మ కమిటీల ఎంపిక ప్రక్రియ జిల్లాలో చివరి దశకు చేరుకుంది. నాలుగు మునిసిపాలిటీల్లోని వార్డులతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. కాగా, ఇందిరమ్మ కమిటీల ఏర్పాటులో అక్కడక్కడ ఒత్తిడి నెలకొన్న వార్డులు, పంచాయతీల్లో మాత్రం విబేధాలకు చోటు కల్పించకుండా చర్చించి కమిటీల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందిరమ్మ కమిటీల్లో విద్యావంతులు, సామాజిక కార్యకర్తలకు అవకాశం కల్పించి అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.

తాండూరు-వికారాబాద్ రోడ్డు అభివృద్ధికి పెరిగిన నిధులు

తాండూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తాండూరు-వికారాబాద్ రోడ్డు అభివృద్ధికి మన్ని నిధులు పెరిగాయి. ప్రస్తుతం ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 813లలో ఈ రోడ్డుకు రూ.101కోట్లు మంజూరు చేస్తూ ఆర్‌అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ -టు- గవర్నమెంట్ వికాస్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్ట్-ఎలో రూ.51.22కోట్లు, పార్ట్-బిలో రూ.49.78 కోట్లను సాంకేంతిక మంజూరు చేశారు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో జూలై 20వ తేదీన 'తాండూరు - వికారాబాద్ రోడ్డుకు మహర్దశ' అనే శీర్షికతో కథనం ప్రచురితమైయింది. ఇందులో డబుల్ రోడ్డు కావడంతో పాటు శాశ్వత ప్రాతిపదికన నిర్మాణం చేపట్టేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశించారని, అప్పట్లో రూ.50కోట్లపై నున్న ఎస్టిమెంట్స్‌ను సవరించి అవసరమైన నిధులను సుమారు రూ.100కోట్ల వరకు అంచనా వేసినట్లు ఆంధ్రజ్యోతి కథనంలో పేర్కొనబడింది.

ప్రత్యేక నిధులు కేటాయించండి



స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మర్పల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మర్పల్లి మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కాంగ్రెస్ బ్లాక్ టు అధ్యక్షుడు కృష్ణారెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. కోటమర్పల్లి గ్రామానికి చెందిన దాదాపు 200 మంది సోమవారం స్పీకర్ నివాసానికి వెళ్లి గ్రామ, మండల సమస్యలపై వివరించారు. కొన్ని గ్రామాల్లో గ్రూపులుగా ఏర్పడటంతో పార్టీకి నష్టం కలుగుతుందని తెలిపారు. కోటమర్పల్లి నుంచి చిట్టెంపల్లి, బూచన్‌పల్లితో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు.

గ్రూప్-1 అభ్యర్థులకు వసతి, భోజన సౌకర్యం

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇతర జిల్లాల నుంచి ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పరీక్షలు రాసే గ్రూప్-1 అభ్యర్థులకు వైఎస్సార్ ట్రస్టు వసతి, భోజన సౌకర్యం కల్పించింది. మాజీ ఎంపీపీ, వైఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో గ్రూప్-1 పరీక్షలు రాసే అభ్యర్థులు తన నివాసంలో ఉండటానికి వసతితో పాటు భోజనసౌకర్యం కల్పించారు. తన నివాసంతో పాటు కార్యాలయాలు, మహిళా అభ్యర్థులుంటే ప్రత్యేకంగా హాస్టళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 161 మందికి భోజన సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఏడు రోజుల పాటు గ్రూప్-1 అభ్యర్థులకు సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా భ్రమరాంభ మల్లికార్జునస్వామి కల్యాణం

బొంరాస్‌పేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలోని హకీంపేట్‌లో సోమవారం శ్రీ భ్రమరాంభ మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు ఆలయ పురోహితులు రుద్రాభిషేకం నిర్వహించారు.

ఉచిత శిక్షణ

వికారాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్/ఐబీపీఎస్ పరీక్షలకు సన్నద్ధమయ్యే జిల్లాకు చెందిన అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 60రోజుల పాటు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కమలాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల గడువును 27వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులను మెరిట్ రిజర్వేషన్ పద్ధతిన ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 040-27540104 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

పోర్టబుల్ క్యాబిన్ మీ సేవా ప్రారంభం

వికారాబాద్: యువత ఉద్యోగాల కోసమే కాకుండా ఉపాధి అవకాశాలను అందింపుచ్చుకుని వ్యాపార రంగంలో రాణించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కొత్తగడిలో సోమవారం మీసేవా నిర్వాహకుడు శేఖర్ పోర్టబుల్ క్యాబిన్ మీ సేవాను ఏర్పాటుచేయగా సుధాకర్‌రెడ్డి హాజరై ప్రారంభించారు.

24న ఉచిత కంటివైద్య శిబిరం

కొడంగల్ రూరల్: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఈ నెల 24వ తేదీన నిర్వహిచనున్నట్లు ఆప్తాల్మిక్ అధికారి హరినాథ్ నెహ్రూ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం ఉదయం 10 గంటల నుంచి శిబిరం కొనసాగుతుందని తెలిపారు.

త్వరలో బీసీ రాజకీయ పార్టీ

తాండూరు: అన్నివర్గాల అభిప్రాయం సేకరణ తర్వాత బీసీ రాజకీయ పార్టీ ఏర్పడనుందని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేసినట్లు ఆ సంఘం తాండూరు కన్వీనర్ రాజ్‌కుమార్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో సోమవారం తాండూరు బీసీ నేతల బృందం కృష్ణయ్యను కలిసి పలు విషయాలపై చర్చించారు. బీసీ సంఘం నాయకులు సయ్యద్ సుకురు, గడ్డం వెంకటేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

అచ్చుతాపూర్ విద్యార్థికి ఎంబీబీఎస్ సీటు

యాలాల: అచ్చుతాపూర్ గ్రామానికి చెందిన టీయూటీఎఫ్ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శివప్ప కుమారుడు మణికంఠ నీట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి నల్గొండలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా పలువురు మణికంఠను సన్మానించారు.

నూతన ఎన్నిక

మేడ్చల్ టౌన్: శ్రీరంగవరంలో సోమవారం మాదిగ మహవీర్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఎం.నర్సింహ, ఉపాధ్యక్షులుగా ఎల్లయ్య, సురేష్, జాయింట్ సెక్రటరీగా టి.శ్రీధర్, కోశాధికారులుగా కృష్ణకుమార్, అశోక్, పది మందిని సలహాదారులుగా ఎన్నుకున్నారు.

పెండింగ్ స్కాలర్ షిప్స్ విడుదల చేయాలి

వికారాబాద్: ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం ప్రభుత్వ కళాశాలల విద్యార్థులతో పట్టణంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ చౌరస్తాలో పెద్దఎత్తున రాస్తారోకో చేశారు.

స్టడీ మెటీరియల్‌ను పంపిణీ

బొంరాస్‌పేట్: యూత్‌ఫర్ సేవా సంస్థ సహకారంతో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, ఎంఈవో విజయరామారావు ఆధ్వర్యంలో చిలుముల్‌మైలారం, చౌదర్‌పల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.

హామీలన్నింటినీ ప్రభుత్వం అమలు చేస్తోంది

కులకచర్ల: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు అన్నారు. ఆయన సోమవారం కులకచర్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో పుట్టపహాడ్‌లో బతికి ఉండగానే రైతు బీమా తీసుకున్నది బీఆర్ఎస్ నాయకులు కాదా? అని ప్రశ్నించారు.

హెల్త్ సెంటర్‌కు భూమిపూజ

దౌల్తాబాద్: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్రాములు తదితరులు రూ.20లక్షల వ్యయంతో హెల్త్ సెంటర్ నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోతిలాల్, దస్తప్ప పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మేడ్చల్ టౌన్: మండలంలోని రావల్‌కోల్ గ్రామ సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

శామీర్‌పేట: ఐడీఏ లక్ష్మాపూర్ ఫీడర్ మరమతుల కారణంగా మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 10గంటల నుంచి విద్యుత్ అంతరాయం కలుగుతుందని అలియాబాద్ విద్యుత్ ఏఈ వెంకటనారాయణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.